# నమస్తే తెలంగాణ
# జగిత్యాల

5 | కరీంనగర్, శుక్రవారం 14 మార్చి 2025 | JAGTIAL


## తాగునీటికి తండ్లాట



ఎండ దంచుతున్నది. మరోవైపు తాగునీటి తండ్లాట తీవ్రమవుతున్నది. చుక్కనీటి కోసం ఎదురుచూడాల్సి వస్తున్నది. కరీంనగరంలో కుళాయి వద్ద ఇలా గంటల కొద్దీ నిరీక్షించి నీటిని పట్టుకోవాల్సి వస్తున్నది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఆరెపల్లిలో కుళాయి వద్ద నీళ్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలు



కేక్ కట్ చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మహిళలు, నాయకులు

## హ్యాపీ బర్త్‌డే మేడం

న్యూస్ నెట్‌వర్క్, మార్చి 13 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజును ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. నాయకులు, అభిమానులు కేక్‌లు కట్ చేసి, 'హ్యాపీ బర్త్‌డే మేడం' అంటూ శుభాకాంక్షలు తెలిపారు. మొక్కలు నాటారు. అన్నదానాలు చేశారు. దవాఖానల్లో పండ్లు పంచారు. సల్లంగా బతుకు అంటు దీవెనలు అందించారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హైదరాబాద్‌లో ఆమెను కలిసి విషెస్ తెలిపారు.



**నాడు** 2023 మే 7 అంటే భానుడు నిప్పులు కక్కే రోజు.. ఆ సమయంలోనే తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ వద్ద మానేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాం పరవళ్లు తొక్కింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్న సాగర్ నుంచి కూడెల్లి వాగు ద్వారా ఎగువ మానేరును నింపడంతో అక్కడి నుంచి పరవళ్లు తొక్కిన మా'నీరు' దిగువన నిర్మించిన చెక్‌డ్యాంలను నింపుకుంటూ శ్రీరాజరాజేశ్వర జలాశయానికి చేరుకున్నది.



**నేడు** 2025 మార్చి 13 అంటే ఇప్పుడిప్పుడే ఎండకాలం మొదలవుతున్న సమయం. కానీ, అదే మానేరు ఎడారిలా మారింది. రెండేళ్లలోనే వాగు పరిస్థితి తారుమారైంది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో చుక్క నీరు లేక అదే కస్బెకట్కూర్ చెక్ డ్యాం వెలవెలబోతున్నది. బొట్టుబొట్టు ఒడిసి పట్టిన నీరు ఆవిరయ్యింది. ఫలితంగా రెండు వైపులా ఉన్న పంటలు ఎండి అన్నదాత బతుకు భారమైంది.

## నాడు పరవళ్లు.. నేడు పాతాళానికి నీళ్లు

రాజన్న సిరిసిల్ల, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : నాడు ఉమ్మడి రాష్ట్రంలో కరువు కాటకాలతో తల్లడిల్లిన రాజన్న సిరిసిల్ల జిల్లా, స్వరాష్ట్రంలో సస్యశ్యామలమైంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మంత్రి కేటీఆర్ ముందుచూపుతో పచ్చగా మారింది. కరువు నేలలో ప్రాజెక్టులకు తోడు కాళేశ్వర జలాలు పరుగులు తీయించడం, మానేరువాగుపై11, మూలవాగుపై 13 చెక్‌డ్యాంలు నిర్మించడంతో సాగునీటికి రంది లేకుండా పోయింది. ఫలితంగా అప్పుడు భూగర్భజలాలు పైపైకి చేరాయి. 2022లో 6.38 మీటర్ల లోతులోనే దర్శనమిచ్చాయి. కానీ, ఈ యేడాదిన్నరలో సర్కారు ప్రణాళికాలోపంతో చెరువులు, కుంటలే కాదు, చెక్‌డ్యాంలు వట్టిపోయాయి. భూగర్భజలాలు అడుగంటి, ఏకంగా 9.28 మీటర్లకు పడిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో ఎటుచూసినా సాగునీటి సమస్యలే వెంటాడుతున్నాయి. ఎండుతున్న పంటలను చూసి రైతులు కన్నీరు పెడుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

## అసమర్థ పాలనతో రైతుల కన్నీరు

- సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయి
- అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- చిన్నబోనాలలో ఎండిన పంటల పరిశీలన



చిన్నబోనాలలో ఎండిన వరిని పరిశీలిస్తున్న తోట ఆగయ్య, జిందం చక్రపాణి, నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 13: ముందు చూపులేని కాంగ్రెస్ అసమర్థ పాలన సాగిస్తున్నదని, రైతుల కంట కన్నీరు తెప్పిస్తున్నదని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మండిపడ్డారు. సాగునీరు అందక యాసంగి పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎండిపోతున్న పంటలకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని, నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలలో సాగునీరందక ఎండిపోయిన వరి పంటలను గురువారం బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. తమ గ్రామంలోని చెరువుల్లో చుక్కనీరు లేదని, బావులు, బోర్లు ఎత్తిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు లేక చేతికచ్చిన పంటలు ఎండిపోతున్నాయని, సుమారు 150 నుంచి 200 ఎకరాల్లో వరి ఎండిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం నాయకులు ఎండిపోయిన చెరువు, వట్టిపోయిన బోర్లు, నిలిచిపోయిన కాలువ పనులను పరిశీలించారు. ఆ తర్వాత ఆగయ్య మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌ను ముందే నింపితే పంటలు ఎండిపోయేవి కాదని చెప్పారు. కేసీఆర్ సర్కార్ హయాంలో పంటలు ఎండిపోలేదని, సకాలంలో సాగునీరందించారని గుర్తు చేశారు. ఇప్పుడున్న కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తూ, రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ అండగా ఉంటుందని మరోసారి ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మాజీ మండలాధ్యక్షుడు వొజ్జల అగ్గి రాములు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వెంకటరమణ రావు, నర్మేట ప్రభుదాస్, బండారి శ్యాం, రాములు, మాజీ కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, ఒగ్గు రాజేశం, పోచవేని ఎల్లయ్య యాదవ్, బుర్ర మల్లికార్జున్ గౌడ్ రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

## మార్చురీకి పోయేది.. స్ట్రెచర్ ఎక్కేది కాంగ్రెస్సే

- దేశంలో బలహీనమైన సీఎం రేవంత్‌రెడ్డే
- ఎప్పుడేం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలుస్తలేదు
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మానకొండూర్ రూరల్, మార్చి 13: రాబోయే రోజుల్లో మార్చురీకి పోయేదీ, స్ట్రెచర్ ఎక్కేదీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఎద్దేవా చేశారు. దేశంలో బలహీనమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనని, ఆయన ఎప్పుడేం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సీఎం రేవంత్ రెడ్డి ముమ్మందు కరీంనగర్‌లో ఏ సభ పెట్టినా అడ్డుకుంటామని హెచ్చరించారు. మానకొండూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పనైపోయిందని, ఆ పార్టీ కంటే బీఆర్ఎస్ చాలా బలంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డిని ఎవరూ పట్టించుకోవడం లేదని, ఆయన ఏదైనా సభలో, సమావేశంలో మాట్లాడుతుంటే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే అక్కడి నుంచి వెళ్లి పోతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి దుర్యోధనుడిగా వ్యవహరిస్తున్నారని, తుపాకీ రాముడు అనే బిరుదును ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. రేవంత్‌రెడ్డి గడిచిన 14 నెలల్లో కేసీఆర్, కేటీఆర్ ఫ్యామిలీని తిట్టుడు తప్ప రాష్ర్టానికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. చొప్పదండి మండలంలో సాగునీటి కోసం రైతులు ధర్నా చేస్తుంటే, మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల మధు, మానకొండూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

## రేవంత్‌రెడ్డి.. చీప్ మినిస్టర్

బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి ధ్వజం



కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి

గోదావరిఖని, మార్చి 13: 'రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. సభ్యత లేని చీప్ మినిస్టర్' అని బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి ధ్వజమెత్తారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. గురువారం గోదావరిఖనిలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ చావునోట్లో తలపెట్టి తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పదేళ్లలో బంగారు తెలంగాణగా తీర్చిదిద్దారని కొనియాడారు. అలాంటి మహానేతను తన వక్రబుద్ధితో, కనీసం సభ్యత లేకుండా మాట్లాడిన రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామూర్తి మాట్లాడుతూ, ఉద్యమనేత కేసీఆర్‌పై కనీస సంస్కారం లేకుండా మాట్లాడిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని అభిప్రాయపడ్డారు. వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు వడ్డెపల్లి శంకర్, మద్దికుంట శంకర్, పున్నం శశికుమార్, నూనె కొమురయ్య, చల్పూరి సతీశ్, బొగ్గుల సాయి, నిమ్మరాజుల రవి, గడపురం కల్యాణ్‌రాజు, చల్ల రవీందర్‌రెడ్డి, బొగ్గు సురేందర్, గోపి, సురేశ్, ఉప్పు సాయి పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో బోరుబావి వద్ద దీనంగా రైతు వడ్నాల లచ్చయ్య

## రూ.2లక్షలు పెట్టినా మూడు బోర్లు పాయె

- ఎండిపోయిన ఆరెకరాల పొలం
- చేసేదేమీ లేక జీవాల మేతకు
- ఇది రైతు వడ్నాల లచ్చయ్య గోస

ఎల్లారెడ్డిపేట, మార్చి 13: భూగర్భజలాలు అడుగంటిపోవడం.. బోరుబావులన్నీ ఎత్తేయడంతో పొట్టదశకు వచ్చిన వరి ఎండిపోతున్నది. పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేయాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో బోర్లు వేస్తున్నా చుక్కనీరు రాక రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కండ్లముందే పంట ఎండిపోవడంతో చేసేదేమీ లేక లక్షల్లో పెట్టుబడి పెట్టిన సాగు చేసిన పంటలను వేల రూపాయలకే జీవాల మేతకు అప్పగిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన వడ్నాల లచ్చయ్యది ఇదే దుస్థితి. ధర్మాజీ చెరువు సమీపంలో తన ఆరెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాడు. పదిహేను రోజుల క్రితం గతంలో ఉన్న మూడు బోర్లు ఎత్తేయగా, మరో ₹2లక్షల అప్పు చేసి వారం రోజుల్లో మూడు బోర్లు వేయించాడు. అయినా చుక్క నీరు పడలేదు. ప్రస్తుతం ఆరెకరాలకు పొలానికి కేవలం 15గుంటలు మాత్రమే పారుతున్నది. మిగతా 5.25ఎకరాల పొలం ఎండిపోవడంతో చేసేదేమీలేక జీవాల మేత కోసం గొర్రెల కాపరులకు ₹12వేలకు ఇచ్చాడు. మూడు బోరుబావులు వేసేందుకు ₹2లక్షలు కాగా, పెట్టుబడి కోసం మరో ₹2లక్షల వరకు ఖర్చయిందని సదరు రైతు వాపోతున్నాడు. వ్యవసాయమంటే ఇష్టం ఉన్నందునే భూమిపై ఇప్పటికే ₹13 లక్షలు అప్పు చేశానని చెప్పాడు. పరిస్థితి ఇలా ఉంటే పెట్టుబడులు ఎలా వస్తాయని ఆవేదనగా చెబుతున్నాడు.

## నీళ్ల కోసం రోడ్డెక్కిన రైతు

- బీఆర్ఎస్ నాయకులతో కలిసి కదం
- మధురానగర్‌లో ధర్నా, రాస్తారోకో ఉద్రిక్తం
- బీఆర్ఎస్ నాయకుల బలవంతపు అరెస్టులు
- మాజీ ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్

గంగాధర, మార్చి 13: సాగునీటి కోసం గంగాధర మండల రైతులు కదం తొక్కారు. చొప్పదండి నియోజకవర్గంలో పంటలు ఎండిపోతున్నాయని, నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో చేశారు. అప్పటికే చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. బీఆర్ఎస్ నాయకులను వెంటాడి అరెస్టు చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. నాయకులు, రైతులు రెండు చోట్ల ధర్నాకు దిగడంతో హఠాత్పరిణామానికి గురైన పోలీసులు రెండు చోట్లకు పరిగెత్తుకు వెళ్లి రైతులు, బీఆర్ఎస్ నాయకులను పక్కకు తీసుకెళ్లారు. పార్టీ ముఖ్య నాయకులను అరెస్టు చేసి గంగాధర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, మడ్లపల్లి గంగాధర్, రామిడి సురేందర్, ముక్కెర మల్లేశం, వడ్లూరి ఆదిమల్లు, తడిగొప్పుల రమేశ్, దోమకొండ మల్లయ్య, మామిడిపల్లి అఖిల్, సుంకె అనిల్, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మధురానగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న నాయకులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

## నిరసన తెలిపే హక్కు లేదా..?

- ధర్నా కోసం వెళ్తుంటే అక్రమంగా అరెస్ట్ చేస్తారా?
- ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే రైతులకు భరోసానివ్వాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె ధ్వజం

గంగాధర, మార్చి 13: చొప్పదండి నియోజకవర్గంలో ఎండిపోతున్న పంటలకు సాగునీరు అందించకుంటే ధర్నా చేస్తామని ముందే హెచ్చరించామని, రైతు ధర్నాలో నిరసన తెలిపేందుకు వెళ్తుంటే అక్రమంగా అరెస్టు చేస్తారా..? అని మాజీ ఎమ్మె ల్యే సుంకె రవిశంకర్ నిలదీశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చివరి ఆయకట్టు వరకు నీరిస్తానని ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు సాగునీరు ఇవ్వాలని రైతుల కోరితే వారిపై బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఆయన పేరు మేడిపల్లి సత్యం కాదని, అసత్యం అని ఎద్దేవా చేశారు. గంగాధర మండలం బూరుగుపల్లిలోని తన నివాసం నుంచి రైతు ధర్నాకు బయలుదేరుతుండగానే సుంకె రవిశంకర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కాళేశ్వరం జలాలు సకాలంలో అందక పంటలు ఎండిపోతున్నాయని దుయ్యబట్టారు. కాళేశ్వరం జలాలను విడుదల చేస్తే రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పేరు వస్తుందన్న అక్కసుతోనే సీఎం రేవంత్‌రెడ్డి రైతులను అరిగోస పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జలాశయాల్లో నిండుగా నీరున్నా పంటలకు చుక్క నీరందించని దౌర్భాగ్య స్థితిలో పాలకులు ఉన్నారని మండిపడ్డారు. పదేళ్లు నీటి కరువు అన్నదే తెలియని రైతులు ప్రస్తుతం సాగునీరు లేక పంటలు కాపాడుకునేందుకు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పంటలకు తక్షణమే ఎకరాకు ₹20 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులకు బాసటగా నిలువాలని హితవుపలికారు. అబద్ధాలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

## కీడు సోకిందని ఊరు ఖాళీ



ఊరు బయట వంటలు చేసుకుంటున్న విలాసాగర్ గ్రామస్తులు

జమ్మికుంట (హుజూరాబాద్), మార్చి 13 : కీడు సోకిందని ఊరంతా ఖాళీ చేసిన ఘటన జమ్మికుంట మండలం విలాసాగర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విలాసాగర్‌లో రెండు నెలల్లో 13 మంది వేర్వేరు కారణాలతో మృత్యువాత పడ్డారు. ఒకరి దశ దిన కర్మ కాకముందే, మరొకరు వరుసగా మరణించడంతో బెంబేలెత్తిపోయారు. కాగా, పురోహితుల సూచన మేరకు గురువారం సూర్యోదయానికి ముందే గ్రామస్తులంతా ఇండ్లకు తాళాలు వేసి, ఊరి శివారులో కీడు వంటలు చేసుకున్నారు.



మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

## సీఎంవి మతిలేని మాటలు

సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, మార్చి 13 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మతిలేని మాటలు మాట్లాడుతున్నారని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు విమర్శించారు. సీఎం హోదాలో ఉండి దిగజారుడు మాటలు మాట్లాడడం సరికాదని హితవు పలికారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆగమైందని, ఆ పార్టీ బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయక ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సాగునీరు అందక పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇలానే ముందుకెళ్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, నాయకులు సాదుల్, కూస నరేశ్, కూనబోయిన రఘు, సత్యం, శంకర్, మహేశ్, మధు, సాయి ప్రసాద్, జనార్దన్, ప్రశాంత్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.